# 6. కోర్కె

భాస్కరం బావను నేను జీవితంలో మరిచిపోలేను. ఒక కంచాన తిని, ఒక మంచాన పరుండి ఆటల్లో, పాటల్లో ఐక్యమై గడిపిన ఆరేళ్ల సౌహార్ద్రాన్ని మరిచిపోవటం సులభమైన పని మాత్రం కాదు. ఇవన్నీ చిన్ననాటి ముచ్చట్లే అయినా, నా దృష్టిలో చిన్నవి మాత్రం కావు. మానవ హృదయాన్ని మభ్యపెట్టి, కనపడని గాయాన్ని చేయగల పదునుంది వాటికి.

నా పదకుండో ఏట బావ పట్నం వెళ్లిపొయ్యాడు. అతను వెళ్తూన్న నాడు ఒంటరిగా కూర్చొని ఏడ్చాను. ఎంత బాధపడ్డాను! కాని అతను అమితమైన సంతోషంతో వెళ్లిపొయ్యాడు. బాధపడలేదేమో! ఐనా నాకు అతని మీద అసహ్యత పుట్టలేదు. ఎంతో విలువైన వస్తువును పోగొట్టుకున్నాను. బావతో గడిపిన అమూల్య క్షణాల్ని తల్చుకొని వేదన అనుభవించాను.

మా కుటుంబ పరిస్థితిల్లో కూడా మార్పులు కలిగినై. నాన్నా, పెదనాన్నా వేరుపడ్డారు, పెదనాన్న భాగ్యంలో మాది సగమే అయినా నాకు విచారం లేదు. పన్నెండేళ్లు ఒకే ఇంట్లో, ఒకే కుటుంబంలో పెరిగిన పెదనాన్న ఏకైక పుత్రిక వసంతను విడిచి మరో ఇంటికి వెళ్లినా నాకు బాధ కలగలేదు...ఆస్తిలో యీ మార్పు వచ్చినా ఇంకా అందరమూ ఏక కుటుంబీకులుగానే మెలుగుతున్నాం.

రెండు సంవత్సరాలు గడిచినై. బావ మా ఊరు రానేలేదు. ఎప్పుడో ఒకనాడు అతను వొస్తాడనీ, ఆ చిన్ననాటి మాటల్నీ స్నేహాన్నీ జ్ఞాపకం చేస్తాడనీ... మళ్లీ అతనితో ఆడి పాడుతూన్నట్టూ కలలు కూడా వొచ్చేవి ... ఒక రాత్రివేళ లేచి కూర్చొని స్వప్నగత

వృత్తాంతాల్ని జాగ్రత్తగా జ్ఞాపకం చూసుకొని అమిత ఆనందాన్ని అనుభవించేదాన్ని. బావ ఏనాడో తిరిగి వస్తాడనేది భ్రమ కాదు. అతను ఎందుకు వస్తాడో, దేనికి రావాలో నాకే తెలియదు...ఐనా వస్తాడు!

"వసంతా! బావ వస్తే బాగుండును--" అనేదాన్ని.

"పోనిస్తూ- ఇప్పుడు దేనికి అదంతా?" అనేది అక్క, మా ముగ్గురి స్నేహాల్లోనూ ఎంత భేదం!

పెద్దదాన్నయ్యాను. నా వివాహ ప్రయత్నాలు కూడా సాగినై. నా యీడు వసంతకు కూడా వరుణ్ని అన్వేషిస్తున్నారు. నాకు మాత్రం ఇది పెద్ద సమస్యగా తోచనేలేదు.

నాన్న అమ్మతో అంటున్నాడు: "రేపు భాస్కరమూ, తల్లీ పెళ్లిచూపులకు వస్తారు--"

నాకు పట్టరాని ఆనందమైంది. బావ వస్తే ఏం సంభాషించాలో ఆలోచించాను. బావ నన్ను మరిచిపోయి వుంటాడేమో? అసంభవం! సంభవమని నేను ఒప్పుకోలేను. అందరూ నాలాటి వాళ్ళేనని అనుకోవటం నాలో యీనాటికీ పోలేదు.

నాలాగే బావ బాగా మారిపోయి వుంటాడు. బాగా చదువుకొని నాగరికతను అధికంగా ఆరాధించి వుంటాడు- అతని సభ్యతా ప్రదర్శనే వేరు. నన్ను 'పల్లెటూరి పడుచా!' అంటాడు. అతనితో మర్యాదగా మాట్లాడాల్సిన తీరు నాకు తెలియదేమో?....

ఏ బావ కోసం ఇన్నాళ్ళూ ఉవ్విళ్ళూరానో- ఆ బావే వస్తాడు! ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. అతని రాకా, అతనితో ఒంటరిగా కూర్చొని మాట్లాడుతూ నవ్వు కోవటమూ.. ఇదీ నా ఊహాప్రపంచంలోని కోలాహలం...!

## 2

ఆ సాయింత్రం బాగా ముస్తాబై వచ్చాడు బావ. అతని దుస్తుల్లో ఎంత మార్పు! మనిషి కూడా పూర్తిగా మారిపొయ్యాడు. పొడుగూ లావూ అయ్యాడు. కాని, గంభీరంగా కూర్చున్నా ముద్దొచ్చే అతని ముఖంలో మార్పులేదు...!

బావ వచ్చాడని పరుగెత్తుదా మనిపించింది. కాని అంతమందిలో నాకు కాళ్ళాడలేదు. చాలా సిగ్గేసింది... పూర్వం- బావతో ఒక క్షణమైనా వృథా కాకుండా ఎలా గడపటమా అని ఆలోచించుకొన్న విధానంలోని ఏ భాగమూ నాకు జ్ఞాపకం రాలేదు. నన్ను కూడా అమ్మ అలంకరించింది. ఇదంతా బావ ముందు ప్రదర్శించేందుకు!

కాని బావ వచ్చింది నాతో ఆడుకునేందుకు కాదు. స్వేచ్ఛగా మాట్లాడేందుకు కాదు. స్నేహితుడిగానూ కాదేమో! నాలోని దుర్గుణా లన్నింటినీ ఏరి- నేను తనకు పనికివచ్చే వస్తువును అవునో కాదోనని పరీక్షించేందుకు! ఆ పరీక్షలో మొగమాటానికి కానీ, దయకు కానీ స్థానం వుండదు. ప్రార్థనలూ, దీనాలాపాలూ విని భక్తుడికి

సాక్షాత్కరించే భగవంతుడిలాగు నాకు ఇదివరకు కన్పించిన బావ - ఈనాడు కూడా భగవంతుడే కాని– ఆ రూపంలో కాదు... తనకు బలికాబొయ్యే పశువును స్వయంగానే ఎన్నుకొనేందుకు వచ్చే అవతారమిది!

అతిథులు కూర్చున్నాక, అమ్మ నన్ను పంపింది. తల వొంచుకు కూర్చున్నా. ఎవరివైపూ ధైర్యంగా చూసేందుకు మనసొప్పలేదు. కాని బావను చూడాలన్న తీవ్ర కాంక్షను ఆపుకోలేక ఒక్క క్షణకాలం బావను చూశాను. అతడు నా వైపు చూస్తూన్నట్టే లేదు. ఎంత మార్పు!

బావ చూపిన విముఖత నన్ను ఎక్కువ బాధించింది. బావ రాకపోతేనే బాగుండేదేమో! ఏమైనా బావతో మాట్లాడాలి. ఎట్లా?

రాత్రి భోజనాలయ్యాయ్. పెద్దవాళ్లందరూ ఇష్టాగోష్ఠిలో వున్నారు. డాబా మీద బావ పండువెన్నెట్లో పడుకొని కూనిరాగాలు తీస్తున్నాడు. మెల్లిగా పైకి వెళ్ళి నిలబడ్డాను.

మాట్లాడే శక్తిని కూర్చుకొని, "బా–వా!" అన్నా.

అతను తుళ్ళిపడి లేచి, మాట్లాడేందుకు సంశయిస్తూన్న వాడల్లే, "ప–ద్మా..." అన్నాడు.

వెళ్లి అతని పక్కనే కూర్చొని హృదయావేదనంతా వ్యక్తమయేట్టు ఒక్కసారి పెద్దగా ఏడవాలనిపించింది! కాని ఏడ్పు రాలేదు.

"పద్మా! చాలా మారిపొయ్యావ్!"

నేను మాట్లాడలేదు. కొంచెం ఆగి అతను అన్నాడు: "ఎందుకొచ్చినట్టు–?"

అవును ఎందుకొచ్చాను? బావను చూసి పోదామని వచ్చాను. తను కూడా అందుకేగా వచ్చింది?

"బావా! నువ్వు వచ్చిన పనికే వచ్చాను" అన్నాను.

"నా పని అయింది..." నవ్వలేదు; నవ్వుతే బాగుండేది!

చాలాసేపు నిశ్శబ్దంతో గడిచింది. అతను నన్ను తాకుతే ఎంత బాగుండును! నన్ను ఓదార్చుతే ఎంత బాగుండును! కాని ఏమీ చెయ్యడు. సరిగ్గా నా ముఖంలోకైనా చూడడు! నేను కూడా ధైర్యంచేసి ఏమీ అనలేను. నిశ్శబ్దత సహించలేనిదైంది.

"బావా! నీ ఉద్దేశం యేమిటి?" చాలా ప్రయత్నం మీదనే యీ సంభాషణకు దిగాను.

అర్థంకాని చూపుల్తో, "ఏ విషయంలో?" అన్నాడు.

"నన్ను చూశావుగా...?"

నవ్వాడు. మాధుర్యం లేదా నవ్వులో.

"రేపు వెళ్ళాక కదా చెప్పేది!"

చాలా కుటిలమైన సమాధానం! ధైర్యంలేని దద్దమ్మలు అనాల్సిన మాట అన్నాడు నా బావ.

"ఇంక వెళ్లు... పద్మా! ఎవరైనా చూస్తే బాగుండదు."

తొందరను సూచిస్తూన్న కంఠ మది. ఎందుకొచ్చానా అనిపించింది. నా గాలిమేడలన్నీ నేలమట్టమయినయ్. మాట్లాడేందుకు శక్తి లేదు. పొంగి పొరలి వస్తూన్న దుఃఖంతో గొంతు తడి ఆరుతోంది. నాకు తెలియకుండానే లేచి మెట్లు దిగ నారంభించాను.

## 3

వసంత అక్కయ్యకూ, బావకూ యథావిధిగా వివాహం జరిగిపోయింది. ఇందుకు ఒక్క కారణం మాత్రమే అందరికీ కనిపిస్తుంది. నాన్న కన్న ఎక్కువగా పాటపాడి, ఎక్కువ డబ్బుతో పెదనాన్న బావను, అక్కయ్యకు కొనిఇచ్చాడు. కాని నాన్నకు అంత శక్తి లేదు. అది నా దురదృష్టం!

నా మీద నాకే రోత పుట్టింది. నా కమ్మని కలలన్నీ కరిగిపోయినై. జీవితంలోని యీ నిరాశాఘాతం నన్ను నేనే గుర్తించుకోలేని స్థితికి తెచ్చింది. అక్కయ్య! ఆమెకు బావమీద నాకున్నదానికన్న ఎక్కువ మక్కువ లేదు. ఆమె నాకన్న ఎక్కువ అందమైనది కూడా కాదని అంటారు అందరూ. ఐనా బావ ఆమెకే దక్కాడు!

బావ! నన్నూ, నా అందాన్ని, నా ప్రేమనూ, నా వ్యక్తిత్వాన్నీ దేన్నీ విలువ కట్టలేక కాల తన్నాడు! బావ చనిపోయి వుంటే ఇంత బాధపడేదాన్ని కాదు! అసలు అతను నా జీవిత పథంలో ఎదురవకుండా వుంటే ఎంత బాగుండేది! అక్క నా జీవితానందానికి పెట్టని ఆనకట్టయింది! నా ప్రతిబింబం నాకే ముద్దొస్తుంది. కాని బావ గమనించలేదు! ఆ ధనాశా పిశాచం అతని నేత్రాలను పూర్తిగా మూసేసింది! ఇన్నాళ్ళూ ఎదురుతెన్నులు చూస్తూ- యీనాడు ఆ బాధ నంతటీన్నీ అనుభవించటం సామాన్య మానవప్రాణికి అత్యధికమే!

బావమీద అధిక కోపం వచ్చినా అతన్ని చూడంగానే దుఃఖమొచ్చేది. 'బా-వా!' అని గొంతుదాకా వచ్చినమాటను విచారం వెనక్కు నెట్టేది. నిరాశతో బావను చూడలేక అతని దారినుంచి తొలగిపొయ్యేదాన్ని....

మరో సంబంధం నాక్కూడా స్థిరమైంది. నేను బావ కోసం ఎంత తపించి కృశించానో బావ కూడా నా కోసం అంత బాధను అనుభవించి వుంటాడు. బావ నాకు చేసిన ద్రోహానికి నేను చెయ్యగల ప్రతీకారం వొక్కటే! నాకు అందకుండా బావ పరులపాలైనట్టే అతనికి అందకుండా నేను కూడా అన్యుల పాలవటమే!

ఆ వివాహం నాకు ఇష్టలేకపోయినా– దాన్ని నేను వెల్లడి చెయ్యలేదు. వివాహమయ్యాక కూడా విచారించలేదు. బావ దీన్ని గూర్చి బాధపడటం చూస్తే నాకు తృప్తిగా వుంటుంది.....!

## 4

అది నా పాలిట కాళరాత్రి! అంత బాధను జీవితంలో మరి ఏ సమయానా అనుభవిస్తాననుకోను! బావ మళ్ళీ మా వూరు వచ్చాడు శోభనపు పెళ్లికొడుకై.

నా కళ్ళ ఎదుట ఆ చక్కని బావను అక్కయ్య లాలిస్తుంది! ఇంతకన్న నరకం మేలు! నవ్వుతూన్నప్పుడు గుంటలుపడే ఆ చెక్కిళ్ళు అక్కయ్యకు! అతని పాలభాగాన్ని అంటుకునే హక్కు అక్కయ్యకు! అతని కళ్లల్లో కళ్లుంచి ఆనందించటం అక్క సొత్తు! వీటిల్లో ఏ చిన్న భాగమూ నాకు వుండదు.

తలుచుకుంటే కంపరమెత్తింది. నాయీడు అక్కయ్యకున్న అనుభవానికి నేను నోచుకోలేదు. బావను చిత్రవధ చేస్తున్నా వద్దనను. నాకు చేసిన హానికి అతనికి విధింపబడాల్సిన శిక్ష కూడా అదేనేమో?

కాని బావను చూడకుండా వుండలేను. అతన్ని చూస్తేనే నాలో అనేక కోరికలు రేకెత్తుతయ్. ఎంత ద్వేషాన్ని కల్పించుకున్నా...అతని రూపుకు ఏ శక్తి వుందో కాని నన్ను మోకరింపజేస్తుంది. ఒక్కసారి ముఖంలో ముఖముంచి నవ్వి అతన్ని నవ్వించి...ఆనందిస్తే చాలు. ఏమిటీ పాడు కోర్కె! ఒద్దన్నా, బలవంతాన తిప్పు కుందామన్నా ఆగవు ఈ తలపులు!

వధూవరులు పడకటింట ప్రవేశించారు. నాకు భూమ్యాకాశాలు ఏకమౌ తూన్నట్టనిపించింది. నా యవ్వనమూ సౌందర్యమూ నన్నే బాధిస్తున్నయ్! కాలు కాలిన పిల్లిలాగు పరుగెత్తుకు వెళ్లి పక్క మీద వాలాను.

మాటు మణిగింది. ఈ పాటికి అక్కయ్య నవ్వుతూంటే బావ ఆనందిస్తూంటాడు. అక్కయ్య ఎంత అదృష్టవంతురాలు! ఆమె తలలో ముడుచుకొన్న మల్లెపూలు కూడా అక్కరకు వస్తయ్! నా తలలోని పూలు తెల్లారేప్పటికి నలిగి వాడిపోతై. ఆ గదిలో వాళ్ల అనుభవించే ఆనందం...నాకే మూడో కన్ను వుంటే భస్మీభూతమవరా?

శరీరంలోని ఉష్ణరక్తమంతా ఆగకుండా బావ వైపు పరుగెత్తుతుంది. నిరాశతో చల్లబడదు కాని, కన్నీటి రూపాన బైటికురుకుతుంది. ఇంత కన్నీటికీ వేటగాడి ముందు లేడి కార్చే కన్నీరుకన్న ఎక్కువ విలువ లేదు!

దీర్ఘాలోచనలో పడ్డాను. ఈ సమయానికి బావ బాహువుల్లో అక్కయ్య కిలకిలా నవ్వుతూంటుంది. బైట కాస్తూన్న పండు వెన్నెలంతా బావకూ, అక్కయ్యకూ మరికొందరు

అదృష్టవంతులకూను! చిన్నతనంలోని వెన్నెల రాత్రుల్లో బావతో 'నీడ ఆట' ఆడుకునేందుకూ, చీకూ, చింతా లేకుండా హాయిగా నిద్రపొయ్యేందుకూ ఉపయోగపడ్డయ్. ఆ చంద్రుడే వయసులో మించకుండా వెన్నెలను విరజిమ్ముతున్నాడు నన్ను ఏడిపించేందుకు!

ఈ పాటికి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ వుంటారు; లేక తమలపాకులు సేవిస్తూంటారు. ఎన్ని నోములు నోచి సంపాయించిందో అక్కయ్య యీ అందగాణ్ని! నేనే అక్కయ్యనయితే నా జీవితంలో ఇంత పెద్ద సమస్య ఎదురయ్యేదే కాదు!

వివాహితలు ఇల్లాటి కోర్కెలకు గురి కాకూడదని పాతివ్రత్యాన్ని బోధిస్తారు అత్తయ్యా వాళ్ళూను! ఈ కోర్కెను చంపుకోవటం ఎలా సాధ్యమౌతుంది...? కోర్కెను దాచుకొన్న హృదయంలో తుపాను రేగకుండా ఎలా వుంటుంది? నాకు నేను ఎంత వేదాంతాన్ని బోధించుకున్నా కోర్కెను చంపుకోవటం మాత్రం చేతకాదు: అసలు కోర్కెల్ని చంపుకునేందుకు ప్రయత్నించటం....ఒక కోర్కెను తీర్చుకోవటం కాదు కాబోలు-- వీళ్ళ దృష్టిలో.

పాతివ్రత్య ప్రభావాన్ని గూర్చి ఇంతగా ఉపన్యాసాలు దంచే రమణమ్మత్తయ్య ఒకసారి నాతోనే చెప్పింది: అర్థరాత్రివేళ హాస్టల్ లోంచి వచ్చి- ఆట స్థలంలో ప్రియుని కోసం ఎదురుచూస్తూంటుందట! ఆ యిసుకలోనే ప్రియుడితో రాత్రంతా గడుపుతుందట! ఆమెకు శయ్యలు లేవు; నిర్భయహృదయం లేదు. ఐనా ఆమెకు తృప్తే! విధివశాన విధవయినా ఆమెలోని కోర్కె లెక్కడికిపోయినై?

నాలాగే నిద్రలేకుండా వుంటారు..అక్కా, బావాను! కాని నాది బాధా, వారిది ఆనందానుభవమూను! ఈ పూలూ, ఈ మెత్తని చెక్కిళ్ళూ, చక్కని ముక్కూ ఎవరికీ అందకుండా బావకోసం దాచుకొన్నాను...కాని నిష్ప్రయోజన మైపోయినయ్!

వారి జీవితంలో ఇవ్వి మధురతమ క్షణాలు! బావ నా పక్కనే ఇలా పడుకుంటే అతన్ని నవ్వించి నలిపి...అంత అదృష్టమా?

## 5

తెల్లవారింది. రాత్రంతా నిద్రలేక ముఖం వాడిపోయింది. కళ్ళు ఎర్రనైనయ్. జుట్టంతా రేగిపోయింది. అద్దం ముందు కూర్చొని నా ప్రతిబింబానికి నేనే జాలి చూపుకుంటున్నాను. రాత్రి ఎంత బాధపడ్డాను!

ఇంట్లోంచి పెద్దమ్మ అంటోంది: "పద్మా! ఈ తుండుగుడ్డ బావకు ఇచ్చిరా నీళ్లకొట్లో వున్నాడు."

తుండుగుడ్డ భుజాన వేసుకొని తొట్రుబడుతూన్న కాళ్లతో నీళ్ళకొట్టు వైపు బయలుదేరా. దొడ్లో ఎవ్వరూ లేరు. బావను చూస్తాను. కాని అతను కన్పిస్తూన్నంతసేపూ అంతులేని కోర్కెలతో బాధపడాలి!

బావ స్నానం చేస్తున్నాడు. బలిష్ఠమైన అతని శరీరం మీద నీటి బిందువులు ముత్యాల్లాగు మెరుస్తున్నై. ఇదివరకు అతనిలోని చూడని నూతన సౌందర్యం స్ఫురిస్తోంది. తడిసిన గుడ్డలు అతని శరీరాన్ని అంటి పెట్టుకున్నయ్. గోడకు నిలబడి శిలాప్రతిమలాగు అతన్ని ఏకదీక్షతో చూస్తున్నా. నే నిలబడ్డ భూమే క్రుంగిపోతూన్నట్టనిపించింది.

"ప–ద్మా!" అన్నాడు నా వాలకం ఆశ్చర్యపెట్టినట్టు.

నేను మాట్లాడలేదు. 'బావా! నీ కోసం తపించి, కృంగి కృశిస్తూన్న నన్ను చూడలేకపోతున్నావ్ కదూ?' అన్నట్టు జాలిగా చూశాను.

అతను నవ్వుతూ నా దగ్గిరికి వచ్చాడు. నా స్వామి ఇంత దగ్గిర్లోకి వచ్చే క్షణమొకటి జీవితంలో వుంటుందనుకోలేదు. రుచి చూసి మంచి ఫలాల్ని శ్రీరాముడి కోసం దాచి ఎదురుతెన్నులు చూస్తూ కూర్చున్న శబరి రామదర్శన క్షణమప్పుడు ఇలాగే సంతోషపడి వుంటుంది!

'నేను నీకేం హాని చేశాను నన్నిలా చంపకపోతే' అన్నట్టు దీనంగా అర్ధనిమీలిత నేత్రాలతో చూసి వుంటాను.

నా చెక్కిలిని తాకుతూ, "పద్మా!" అన్నాడు. మాట్లాడలేకపొయ్యాను. అతన్ని వారించలేకపొయ్యాను. ఆ స్పర్శ ప్రభావమేమో కాని, నన్ను నేనే మరిచిపొయ్యాను.

బావ నన్ను గట్టిగా ముద్దుపెట్టుకొనే దాకా అతను ఇంత రసికుడని నాకు తెలియదు. భుజంమీది పమిట జారిపోతున్నా నాకు మతే లేదు. ఫాలభాగాన్ని కప్పిన కురుల్ని పైకి తోస్తున్నాడు ఆ మెత్తని చేతుల్తో ఎన్నాళ్ళనుంచీ వేచి కూర్చున్నాను ఇలాటి సమయం కోసం!

'బా–వా!' అందామని నోటిదాకా వచ్చింది. కాని అతని చిన్న నోరు నా నోటిని మూసేసింది.

అతని బాహువుల్లో ఎంతసేపు వున్నానో కాని దొడ్లో పనిమనిషి కోసం పెద్దమ్మ కేకవేసేదాకా తెలివి రాలేదు... బావ శరీరం మీది నీటి బిందువులన్నీ మాయమైనయ్. తుండుగుడ్డ తనకు అవసరం లేదన్నట్టు కిందపడి ఏడుస్తోంది. ఎంతో తృప్తితో ఒక్క పరుగున గదిలోకి వొచ్చి మంచం మీద వాలాను.

కలలో మాత్రమే తీరగలదనుకొన్న కోర్కె నెరవేరింది! కొన్ని క్షణాల ఆనందమే అయినా– ఇన్నాళ్ళూ నేను అనుభవించిన బాధకు ఇది ప్రతిఫలం! అద్దంలో

చూసుకొన్నాను. బావ పాదాల కడ మోకరించిన ఈ అందమైన శరీరం--! రమణమ్మత్తయ్య అనుభవం బాగా అర్థమైంది!

రాత్రి అక్కయ్య ఇంతకన్న ఎక్కువ ఆనందానికి గురై వుంటుందని నేను అనుకోను. ఆమెకు ఉన్న సౌకర్యాలు నాకు లేకపోయినా నా అనుభవం సామాన్యమైంది మాత్రం కాదు! మైమరిచి కళ్ళు మూసుకొని, గడిచిన క్షణాల్ని తల్చుకుంటే పట్టరాని ఆనందం... ఆనందబాష్పాల ద్వారా బైట పడుతోంది.

రమణమ్మత్తయ్య నవ్వుకుంటూ వొచ్చింది. ఉలిక్కిపడి లేచి కన్నీళ్ళు తుడుచుకున్నా.

"విన్నావటే... పద్మా?"

"ఏమిటీ?"

"పాపం! రాత్రి వధూవరులకు గొప్ప ఆశాభంగం!"

"అదేం?" అన్నా అర్థంగాక.

'నీ కింకా తెలియదా?' అన్నట్టు చూస్తూ, "రాత్రి... వసంత ... చెరగు ... మాపుకుందిగా!" అంది.

కొన్నిక్షణాల పాటు నేను నిశ్చేష్టురాల్నయ్యాను. 'అక్కయ్య స్థానాన్ని నేను తీసుకొన్నాను... ఆ ఆనందాన్ని నేనిచ్చాను! బావకు ఆశాభంగ మవనేలేదు...' అనుకున్నా.

"పెద్ద...ఆశాభంగం!" అంటూ అత్తయ్య పెద్దగా నవ్వింది!

'కాదు' అని లోపల అనుకొని, పెదవి విరిచా.

*- జనవరి, 1941*